
HAPPY BIRTHDAY TO YOU
SRI GADDAM PRASAD KUMAR Garu
"SPEAKER -TELANGANA ASSEMBLY, MLA -VIKARABAD,
శ్రీమతి &శ్రీ అనన్య చేతన్
జన్మదిన
శుభాకాంక్షలు
ప్రజాభిమానమే తన అభిమతంగా,
తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానాన్ని
కొనసాగిస్తున్న ప్రజాహితనేత...
తెలంగాణ రాష్ట్ర శాసన సభ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే
గౌ॥ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారికి
జన్మదిన శుభాకాంక్షలు.
మీ సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం...
విజయీభవ... దిగ్విజయీభవ...
కేతూరి శేఖర్ ప్రసాద్
తెలంగాణ రాష్ట్ర రజక రిజర్వేషన్ సమితి ఉపాధ్యక్షులు
కాంగ్రెస్ పార్టీ కొల్లాపూర్ నియోజకవర్గం
నాగర్ కర్నూల్ జిల్లా
కాంగ్రెస్ పార్టీ కొల్లాపూర్ నియోజకవర్గం - నాగర్ కర్నూల్ జిల్లా

పప్పు ధాన్యాల సాగుపై దృష్టి పెట్టాలి

బషీరాబాద్, జూన్ 03(ఆంధ్రజ్యోతి): పప్పు ధాన్యాల పంటల సాగును పెంపొందించేందుకు రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం, రంగారెడ్డి జిల్లా కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ ద్వారా కంది విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు అధికారులు పి.రామకృష్ణ, డాక్టర్ గౌతమ్ వీర్‌చౌహాన్, డాక్టర్ దిలీప్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఎక్మాయి కేంద్ర వ్యవసాయశాఖ, రైతు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మోడల్ పల్స్ విలేజ్ ప్రాజెక్ట్‌గా ఎంపికైనందున రైతులకు పప్పు ధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నారాయణ, గ్రామ పెద్దలు పట్లోళ్ల శ్రీనివాస్‌రెడ్డి, దుశ్యంత్‌రెడ్డి, సాయిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రౌండ్ ఏర్పాటుకు స్థల పరిశీలన

తాండూరు రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం చెంగోల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆటలు ఆడుకునేందుకు గ్రౌండ్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల ప్రధాన ద్వారం ఎదుట చిన్నపాటి రాళ్లతోకూడిన గుట్ట ఉండటంతో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారని కాంగ్రెస్ నాయకుడు రాముయాదవ్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి విన్నవించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు తాండూరు పంచాయతీరాజ్ ఈఈ సత్యనారాయణరెడ్డి, డీఈ నాగరాజు గుట్టను పరిశీలించారు. గుట్టను తొలగించి ఆట స్థలం ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు.

'కేంద్రం ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ'

తాండూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం గరీబ్ కల్యాణ్ యోజన పథకం కింద ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి అందజేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్ అన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశ్, జిల్లా కార్యదర్శి బంటారం భద్రేశ్వర్, పట్టణ ఉపాధ్యక్షుడు కందనెల్లి సంగమేశ్వర్, ప్రధాన కార్యదర్శి మిట్టి శ్రీనివాస్‌తో కలిసి మంగళవారం తాండూరు పట్టణంలో పలు రేషన్ షాపుల వద్దకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. మోదీ దూరదృష్టితో మూడు నెలల బియ్యం ఒకేసారి సరఫరా చేస్తున్నారన్నారు.

వేపాకులు ధరించి అమ్మకు మొక్కు



తాండూరు రూరల్, జూన్ 3, (ఆంధ్రజ్యోతి): కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. నాలుగో మంగళవారం కర్ణాటక ప్రాంతం నుంచి తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి దర్శించుకున్నారు. కొంతమంది మహిళా భక్తులు వేప ఆకులతో చీర ధరించి బోనాలతో వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మరికొందరు గండజ్యోతి మోస్తూ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

పోస్టర్ ఆవిష్కరణ

మేడ్చల్ ప్రతినిధి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఏటా జూన్ 5న అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా మంగళవారం అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్ఓ హరిప్రియ, ఏఓ రాంమోహన్, సహాయక పర్యావరణ శాస్త్రవేత్త లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



రైతులకు నాణ్యమైన విత్తనాలు


కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి

ధారూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): గ్రామానికి ముగ్గురు రైతులకు ఎంపిక చేసి నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి అన్నారు. ధారూరు రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం వ్యవసాయ శాస్త్రవేత్త పవన్‌కుమార్ రెడ్డితో కలిసి రైతులకు నాణ్యమైన కంది, జొన్న, వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి ముగ్గురు చొప్పున రైతులకు ఈ విత్తనాలు అందిస్తున్నామని, ఈ విత్తనాలు అందుకున్న రైతులు విత్తనోత్పత్తి చేసి ఇతర రైతులకు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో సూర్య ప్రకాష్, ఏఈవోలు సంతోష్, హరి ప్రసాద్ గౌడ్, మంజులు, రైతులు పాల్గొన్నారు.





పెన్షన్లకు దరఖాస్తు చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ లింగ్యానాయక్


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పెన్షన్లకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద రైతు ఆత్మహత్యల కుటుంబాలు, వితంతు పెన్షన్ ప్రతిపాదనలు తదితర అంశాలపై హైదరాబాద్ నుంచి సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ నిర్వహించిన జూమ్ సమావేశానికి సంబంధిత అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో చోటుచేసుకున్న రైతు ఆత్మహత్యలు, పెన్షన్ల పెంపునకు సంబంధించి ఆమె పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు, వృద్ధాప్య పెన్షన్లకు సంబంధించి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. సమావేశంలో కలెక్టరేట్ డీ, హెచ్ సెక్షన్ల సూపరింటెండెంట్లు వెంకటేశ్వరి, న్యామత్ అలీ, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ మహమూద్ అలీ, డీపీఎం నర్సింహులు పాల్గొన్నారు.



మొదటి రోజు 358 రిజిస్ట్రేషన్లు

- స్లాట్ విధానానికి అనూహ్య స్పందన


రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ అందజేస్తున్న రిజిస్ట్రార్ అశోక్

మేడ్చల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా ఉన్న 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పూర్తి స్థాయిలో స్లాట్ విధానం అమలులోకి వచ్చింది. మొదట్లో కాస్త ఇబ్బందులు ఎదురైనా ప్రజలు క్రమంగా స్లాట్ విధానానికి అలవాటు పడుతున్నారు. ఈ విధానంతో సమయం ఆదా కావడంతోపాటు సులువుగా రిజిస్ట్రేషన్ పూర్తి అవుతుండటంతో క్రయవిక్రయదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు రిజిస్ట్రేషన్లు పారదర్శకంగా కొనసాగుతుండటంతో ఇబ్బందులు లేకుండా స్లాట్ విధానం కొనసాగుతున్నది. మొదటి దశలో స్లాట్ విధానం ప్రారంభమైనప్పుడు డాక్యుమెంట్ రైటర్లు వ్యతిరేకించి ఆందోళనలు సైతం చేపట్టారు. ప్రభుత్వం పెద్దగా పట్టించుకోకపోవడంతో ఆందోళనలు విరమించారు. జిల్లాలో మొదటి దశలో మూడు, రెండో దశలో ఐదు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ విధానాన్ని ప్రారంభించగా సోమవారం నుంచి అన్ని కార్యాలయాల్లో స్లాట్ విధానం ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న కార్యాలయాల్లో మొదటి రోజు 358 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి.



రెవెన్యూ సదస్సులు షురూ!

- జిల్లాలో మొత్తం 510 గ్రామాలు
- తొలిరోజు 692 దరఖాస్తులు
- పరిశీలించిన కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రెవెన్యూ సేవలను సులభతరం చేయడమే కాకుండా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టం-2025ను పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు మంగళవారం ప్రారంభించిన రెవెన్యూ సదస్సులు 20వ తేదీ వరకు కొనసాగనున్నాయి. తొలిరోజు నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు రైతుల నుంచి విశేష స్పందన లభించింది. జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు, 20 మండలాల పరిధిలో మొత్తం 510 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ధారూరు మండలంలో గతనెల 5 నుంచి 14వ తేదీ వరకు భూభారతి చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ మండల పరిధిలోని 34 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించగా వివిధ సమస్యలకు సంబంధించి 579 దరఖాస్తులు వచ్చాయి.

తొలి రోజు విశేష స్పందన

జిల్లాలో మంగళవారం నుంచి భూభారతి రెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయి. ప్రతి రోజు రెండు రెవెన్యూ గ్రామాల్లో తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్‌ల పర్యవేక్షణలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సదస్సులు జరగనున్నాయి. జిల్లాలో 20 మండలాలు ఉండగా, ధారూరు మండలం మినహాయించి మిగతా 19 మండలాల్లో భూభారతి చట్టంపై అవగాహన సదస్సులు కొనసాగుతున్నాయి. 476 రెవెన్యూ గ్రామాల్లో తొలిరోజు 19 మండలాల్లో 38 రెవెన్యూ సదస్సులు నిర్వహించగా, 692 దరఖాస్తులు వచ్చాయి. ప్రతి గ్రామంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలను ఓ రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారు. సదస్సులకు వచ్చే రైతులు తాము ఎదుర్కొంటున్న సమస్యను వివరిస్తూ దరఖాస్తు పత్రంతోపాటు లింక్ డాక్యుమెంట్లు, ఆర్వోఆర్ 1987-88 పత్రాలు, 2012 నుంచి 2015 వరకు పహణీలను రైతులు తీసుకురావాల్సి ఉంటుంది. సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను అధికారులు మ్యూటేషన్లు, సక్సేషన్, సర్వే సవరణలు, మిస్సింగ్ సర్వే నంబర్లు, టైటిల్, అసైన్డ్ అంశాల వారీగా విభజించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

సద్వినియోగం చేసుకోవాలి

భూభారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. ఆలంపల్లి, ఎర్రవల్లి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన సదస్సులను తనిఖీ చేశారు. సాదా బైనామా, పీవోపీ, భూవిస్తీర్ణంలో మార్పులు, చేర్పులు, పాసుపుస్తకాల పంపిణీ తదితర అంశాలపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దరఖాస్తుల వివరాలను నమోదు చేసిన రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం పెండ్లిమడుగు గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల వివరాలపై ఆరా తీశారు. లబ్ధిదారులు నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ ఉన్నారు.





డబుల్ ఇళ్లపై విచారణ చేయాలి


మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, శివశంకర్

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ ప్రతాప్‌సింగారం డబుల్ బెడ్‌రూం ఇళ్లలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని, వీటిపై సమగ్ర విచారణ జరిపించాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ప్రతాప్‌సింగారం మాజీ సర్పంచ్ వంగూరి శివశంకర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. మంగళవారం ఉదయం సచివాలయంలో మంత్రిని కలిసి అర్హులైన పేదలకు కాకుండా ఇష్టం వచ్చిన వారి పేర్లు లబ్ధిదారుల లిస్టులో చేర్చారని తెలిపారు. స్పందించిన మంత్రి వెంటనే కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి సమగ్ర విచారణ జరపాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూసమస్యల పరిష్కారం

రెవెన్యూ సదస్సులతో భూసమస్యలు పరిష్కారమవుతాయని అధికారులు తెలిపారు. భూభారతిలో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద మంగళవారం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



తాండూరు రూరల్: ఎల్మకన్నెలో రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్



పరిగి: యాభాజీగూడలో సదస్సులు దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



శామీర్‌పేట్: పోతాయిపల్లిలోని రెవెన్యూ సదస్సులో వినతులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



దోమ: ఊటుపల్లిలో భూ భారతిపై అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో వాసుచంద్ర



చౌడాపూర్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



మేడ్చల్ టౌన్: మునీరాబాద్‌లో దరఖాస్తుల స్వీకరణ



ఘట్‌కేసర్ రూరల్: ఎదులాబాద్‌లో దరఖాస్తును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులైన ఎస్సీ విద్యార్థుల నుంచి బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్సీ కులాల అభివృద్ధి జిల్లా అధికారి కమలాకర్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులు జిల్లాకు చెందిన వారై ఉండాలని, తల్లిదండ్రుల వార్షికాదాయం పట్టణ ప్రాంతాల వారికి రూ.2లక్షలు, గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు మించకుండా ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారాల కోసం కలెక్టరేట్‌లోని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం



నవాబుపేట: విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

నవాబుపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విత్తనం, రైతన్నకు నేస్తమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. ఎల్లకొండలోని రైతువేదికలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గీత రాథోడ్‌సింగ్, పీఏసీఎస్ చైర్మన్ రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

దుద్యాల: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం వరి ఆర్‌ఎన్‌ఆర్ 15048 రకం కంది, జొన్న విత్తనాలను మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త పరిమళ, ఏఈవోలు భావన, మాణికేశ్వరి, రేణుక, జ్యోతి, నాయకులు పాల్గొన్నారు.

బంట్వారం: మండల కేంద్రంలోని రైతు వేదికలో శాస్త్రవేత్త రాజేశ్‌రెడ్డి రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రావ్య, ఏఈవో మచ్చేందర్, రైతులు పాల్గొన్నారు.

చౌడాపూర్: మండలంలో నాణ్యమైన విత్తనం, రైతన్నకు నేస్తం అనే కార్యక్రమంతో రైతులకు శాస్త్రవేత్త నీలిమా, మండల వ్యవసాయ అధికారిణి పరిమళ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు విశ్వనాథ్, వంశీకృష్ణ, భావన తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: మండల కేంద్రంలో మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి నాణ్యమైన విత్తనం, రైతు నేస్తం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త పల్లవి, వ్యవసాయ అధికారులు పెంటయ్య పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: పంటల సాగులో నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏరువాక కేంద్రం సమన్వయకర్త తాండూర్ వ్యవసాయ శాస్త్రవేత్త లక్ష్మణ్ అన్నారు. బొంరాస్‌పేట్‌లో మంగళవారం నాణ్యమైన విత్తనం, రైతన్నకు నేస్తం అనే కార్యక్రమం నిర్వహించారు. రైతులకు 14 కిట్లు వరి, 8 కిట్లు జొన్న, 15 కిట్లు కంది విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి పోలప్ప, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్ పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: మున్సిపాలిటీలోని పూడూర్, రాయిలాపూర్ రైతు వేదికల్లో మంగళవారం అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు కలిసి విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఎంటీయూ 1010 రకం వడ్లను 10కిలోల చొప్పున అందజేశారు. ఈ సమావేశాల్లో పీఏసీఎస్ చైర్మన్లు రణదీప్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శాస్త్రవేత్త లావణ్య, ఏవో అర్చన పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: ఎదులాబాద్ రైతు వేదికలో వ్యవసాయ శాస్త్రవేత్త రాధిక మంగళవారం రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ రామిరెడ్డి, మండల వ్యవసాయ అధికారి లావణ్య, ఏఈవో జగదీష్, మంజుల పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక

ధారూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అన్ని సబ్జెక్టుల్లో బోధనోపకరణాల (ఇంటిగ్రేటెడ్ టీచింగ్ లర్నింగ్ మెటీరియల్)తో విద్యార్థులకు బోధించిన అంశంపై ధారూరు మండలం, నాగసమందర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు సరిత రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో సరిత పాల్గొని బోధనోపకరణాలను ప్రదర్శించారు.

ఐటీఐల్లో ప్రవేశాలు

వికారాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఐటీఐ కోర్సుల్లో మొదటి విడత ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ అయ్యిందని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ నరేంద్రబాబు తెలిపారు. ఐటీఐ మొదటి విడత అడ్మిషన్ల కోసం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ఏడాది, రెండు సంవత్సరాల కోర్సుల్లో ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు ఐటీఐ.తెలంగాణ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈనెల 21వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 10, 8వ తరగతుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఐటీఐ కోర్సుల్లో చేరే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉపాధిహామీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు

దోమ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధిహామీ పథకంలో అవినీతి, అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని డీఆర్‌డీవో పీడీ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో మంగళవారం 16వ విడత సామాజిక తనిఖీలో 2024 నుంచి 2025 ఏప్రిల్ 30వరకు ప్రజావేదిక నిర్వహించారు. తనిఖీలో 36 గ్రామ పంచాయతీలకు సంబంధించి రూ.4,20,290 రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు. ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులకు రూ.57వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. పనుల్లో రికార్డులను సరిచూసుకోకపోవడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి



తాండూరు: పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్

తాండూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులన్నింటిని త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సుధీర్‌కుమార్ ఆదేశించారు. తాండూరు మున్సిపాలిటీలో మంగళవారం ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్, అకౌంట్ మెప్మా సెక్షన్‌లకు సంబంధించి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం పట్టణంలో సుడిగాలి పర్యటన చేసి పలు అభివృద్ధి పనులను స్వయంగా పరిశీలించారు. ఇంజనీరింగ్ విభాగం పని తీరుపట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. చించోలి రోడ్డు మార్గంలోని గత ప్రభుత్వంలో మంజూరైన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డును పరిశీలించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బసవణ్ణ కట్ట వద్ద ఉన్న కూరగాయల మార్కెట్ చేపట్టే వెజ్, నాన్ వెజ్‌స్థలాన్ని పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా అమృత్ 2.0 తాగునీటి ట్యాంకును, హైదరాబాద్ రోడ్డులోని ట్యాంక్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు.

కొనసాగుతున్న వంద రోజుల ప్రోగ్రాం

ఒక మార్పు- అభివృద్ధికి మలుపు అనే నినాదంతో చేపట్టిన వందరోజుల కార్యక్రమం తాండూరు మున్సిపాలిటీలో రెండవ రోజు కొనసాగింది. సోమవారం ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్ కుమార్ పాల్గొన్నారు. మెప్మా ఆధ్వర్యంలో ర్యాలీ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ విక్రం సింహారెడ్డి, డీఈ మణిపాల్, ఏఈ ఖాజా హుస్సేన్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ

ధారూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడు రైతువేదికల్లో మంగళవారం ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ కొనసాగింది. అన్ని గ్రామాల్లో ఫార్మర్ రిజిస్ట్రీని వ్యవసాయ విస్తీర్ణాధికారులు చేయిస్తున్నారు. జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి పరిశీలించారు. ఫార్మర్ రిజిస్ట్రీ ఉన్న రైతులకే పీఎం కిసాన్ డబ్బులు ఖాతాల్లో జమవుతాయని తెలిపారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వ పథకాలు, ఇన్‌ఫుట్ సబ్సీడీలు, రుణాలకు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి అని తెలిపారు. కాగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించడానికి వచ్చిన కొత్త మంది రైతుల భూముల వివరాలు లాగిన్‌లో కనిపించలేదు. ఒకే ఆధార్ కార్డుపై వేర్వేరు గ్రామాల్లో భూములు కలిగి ఉండటమే కారణమని ఏఈవోలు రైతులకు వివరిస్తున్నారు. మల్టీ ల్యాండ్ ఉన్న రైతుల వివరాలు లాగిన్‌లో రావడం లేదని సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేశామని తెలిపారు.

సంక్షిప్తంగా..

వైద్యసేవలు అభినందనీయం

పరిగి: సంతానం కోసం ఇబ్బందులు పడుతున్న దంపతులకు వైద్య నిపుణుల ద్వారా వైద్య సేవలు అందించడం అభినందనీయమని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పరిగి మినీస్టేడియంలో ఒయాసిస్ ఫర్టిలిటీ ఆధ్వర్యంలో మెగా ఫర్టిలిటీ క్యాంపు జనని యాత్రను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బి.పరశురాంరెడ్డి, ఎం.లాల్‌కృష్ణప్రసాద్‌పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

మర్పల్లి: రైతులు ఆందోళన చెందొద్దని మర్పల్లి ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రానికి మర్పల్లి, మోమిన్‌పేట్, ధారూర్, కోట్‌పల్లి మండలాల నుంచి రైతులు పెద్ద మొత్తంలో వచ్చారు. సమయం రెండు రోజులు మాత్రమే ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. విషయం తెలుసుకున్న ప్రవీణ్‌రెడ్డి, వైస్‌చైర్మన్ ఫసియోద్దీన్‌లు మంగళవారం కేంద్రాన్ని సందర్శించారు.

బషీరాబాద్: మండలంలోని కాశీంపూర్ ధాన్యం కేంద్రాన్ని మంగళవారం బషీరాబాద్ సొసైటీ వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్ తనిఖీ చేశారు.

స్వచ్ఛతపై అవగాహన

శామీర్‌పేట: స్వచ్ఛతలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ అన్నారు. వంద రోజుల కార్యాక్రమంలో భాగంగా మంగళవారం మున్సిపల్ పరిధి 7వ వార్డు ద్వారకాపురి, సాయినగర్ కాలనీల్లో తడి, పొడి చెత్త నిర్వహణపై అవగాహన కల్పించారు.

అన్ని వాడల్లో అభివృద్ధి పనులు

పరిగి: అన్నివాడల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. రూ.3లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో ఫారెస్టు కార్యాలయం దగ్గర డ్రైనేజీ సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పరశురాంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, ఇ.కృష్ణ, ఎస్.రామకృ ష్ణ పాల్గొన్నారు.

సీఎంను కలిసిన మాజీ సర్పంచ్‌లు

కొడంగల్: సీఎం రేవంత్‌రెడ్డిని మాజీ సర్పంచ్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం అన్నారం, అక్కంపల్లి మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనారాయణ, టి.అనితా పకీరప్ప హైదరాబాద్‌లో సీఎం నివాసంలో కలిశారు

ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ

మేడ్చల్ టౌన్: అత్వెల్లిలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. కమిషనర్ వెంట మాజీ కౌన్సిలర్ సరిత మల్లేష్‌గౌడ్, మున్సిపల్ ఏఈ జ్ఞానేశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మాణాలను వేగవంతం చేయాలి

మర్పల్లి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో రాజమల్లయ్య అన్నారు. గుండ్లమర్పల్లిలో మంగళవారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను పరిశీలించారు.

జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు షురూ

బషీరాబాద్: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మీడియట్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ ఎస్.నర్సింహారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

దుర్గా వాహిని శౌర్య యాత్ర

ఘట్‌కేసర్: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో దుర్గా వాహిని శౌర్యయాత్రను ఘట్‌కేసర్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. శివారెడ్డిగూడలో గల శ్రీదండ్లగడ్డ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం నుంచి ఘట్‌కేసర్ గ్రంథాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, హనుమాన్ పాల్గొన్నారు.

యోగాకు సమయం కేటాయించాలి

ఘట్‌కేసర్: నిత్యజీవితంలో యోగాకు సమయం కేటాయించాలని ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్‌లో అంత ర్జాతీయ యోగ దినోత్సవం సందర్బంగా మగళవారం ప్రభుత్వాసుపత్రి నుంచి శివారెడ్డిగూడలోని శ్రీదండ్లగడ్డ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వరకు ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాంరెడ్డి, ప్రోగ్రాం మేనేజర్ శ్రీవల్లి పాల్గొన్నారు.

యువ వికాసం స్కిల్ సెంటర్ల ఏర్పాటు

బొంరాస్‌పేట్: యువ వికాసం కోసమే సీఎం రేవంత్‌రెడ్డి స్కిల్ సెంటర్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రం బొంరాస్‌పేట్‌లో ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌కు దీటుగా బీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. గెలుపొందిన బొంరాస్‌పేట్ క్యాపిటల్ జట్టుకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ చేతుల మీదుగా మంగళవారం ట్రోఫీ, షీల్డ్‌లు అందజేశారు.

క్రైం కార్నర్

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

దోమ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన దోమ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. దాదాపూర్ గ్రామానికి చెందిన బాపురం దస్తయ్య (45), మామిడి తోటల వ్యాపారంతో పాటు చిట్టీలు వేస్తూ హోటల్ నడిపిస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ప్రకృతి వైపరీత్యాలతో మామిడి తోటల్లో నష్టాలు రావడంతో పాటు చిట్టీలు వేసిన వారికి డబ్బులు సక్రమంగా ఇవ్వకపోవడంతో మానసికంగా కృంగిపోయాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఆయనను ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతి చెందాడు. దస్తయ్యకు దాదాపు రూ.20 లక్షల వరకు అప్పు ఉంటుందని గ్రామస్థులు తెలిపారు.

డీసీఎం బోల్తా.. తప్పిన ప్రమాదం

పరిగి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళుతున్న డీసీఎం అదుపుతప్పి పరిగిలో పల్టీ కొట్టింది. హైదరాబాద్ నుంచి కొడంగల్ వైపు ఫ్యాన్ల సామాగ్రితో వెళుతున్న డీసీఎం వేగంగా వెళుతూ పరిగి పట్టణంలోని యూనియన్ బ్యాంకు ఎదురుగా మంగళవారం ఉదయం బోల్తా పడింది. ఈఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. రోడ్డుపై ఎవరూలేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

అటవీభూమి ఆక్రమణకు యత్నం..

బషీరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గొట్టిగఖుర్దు రిజర్వు ఫారెస్టులోని అటవీ భూమిని ఓ వ్యక్తి కబ్జాకు యత్నిస్తుండగా బషీరాబాద్ మండల అటవీశాఖ సెక్షన్ అధికారిణి స్నేహశ్రీ, బీట్ అధికారి మల్లప్ప మంగళవారం అడ్డుకున్నారు. గొట్టిగకలాన్-పేర్కంపల్లి సమీప అటవీ ప్రాంతం వద్ద ఓ రైతు తన భూమిని అనుకోని ఉన్న అటవీ భూమిలో రాళ్లను తొలగించి చదను చేసేందుకు యత్నించాడు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు అక్కడికి వెళ్లి పనులను అడ్డుకొని ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకుని తాండూరులోని అటవీశాఖ రేంజ్ కార్యాలయానికి తీసుకువచ్చారు.

ధాన్యం చోరీకి యత్నం.. వ్యక్తికి దేహశుద్ధి

మర్పల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మర్పల్లి మార్కెట్‌లో రైతులు విక్రయించేందుకు నిల్వ చేసిన ధాన్యాన్ని దొంగిలించేందుకు ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు వస్తున్నారని కొంత మంది రైతులు కాపు కాసి పట్టుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఓ వ్యక్తి జొన్నల బస్తాను దొంగిలించేందుకు ప్రయత్నించగా రైతులు పట్టుకుని స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు.

కంప్యూటర్ సెంటర్ నిర్వాహకుడికి...

వికారాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ఓ కంప్యూటర్ సెంటర్ నిర్వాహకుడికి దేహశుద్ధి చేసి ఆపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంఘటన వికారాబాద్‌లో చోటు చేసుకుంది. పట్టణంలో కొనసాగుతున్న ఓ కంప్యూటర్ సెంటర్ నిర్వాహకుడు నవాజ్, మైనార్టీ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో కుటుంబ సభ్యులు నిర్వాహకుడిపై దాడి చేసి కంప్యూటర్ సెంటర్ అద్దాలు పగుల గొట్టారు. దేహశుద్ధి చేసిన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాలిక అదృశ్యం

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యమైన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో ఉన్న బాలిక గాయత్రి మాతా ఆలయం సమీపంలో ఉండే పిన్ని ఇంటికి బాలిక(17) సోమవారం వచ్చింది. రాత్రి భోజనం చేసిన అనంతరం అందరు నిద్రపోయారు. మంగళవారం ఉదయం 7గంటలకు లేచి చూసేసరికి బాలిక కనిపించలేదు. దీంతో బాలిక బంధువులు తెలిసిన వారిని విచారించిన ఫలితం లేదు. మైనర్ బయటకు వెళ్లే సమయంలో తెల్లని టాప్, పింక్ ప్యాంట్, నల్లని బ్యాగ్ వేసుకుందని తెలిపారు. బాలిక బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మూగ, చెవిటి యువతి...

అనాథాశ్రమం నుంచి మూగ, చెవిటి యువతి అదృశ్యమైంది. పోచారం మున్సిపాలిటీ, యంనంపేట్ నవదుర్గ కాలనీలోని ఎంటర్నల్ జాయ్ అనాథాశ్రమంలో ఉండే మేరీ(24) పుట్టుకతో మూగ, చెవిటి. పదేళ్ల నుంచి ఈ ఆశ్రమంలో ఉంటుంది. సోమవారం ఉదయం 11.30లకు మేరీ అనాథాశ్రమం నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆశ్రమ నిర్వాహకులు కె. నాగమణి వెతికినా ఫలితం లేకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దాడిచేసిన ఇద్దరిపై కేసు

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : పోచారం మున్సిపాలిటీ, ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, శ్రీనివాస్‌నగర్ కాలనీకి చెందిన పినగాని రాధిక(30) గతనెల 6న సాయంత్రం 7గంటలకు తన ఇంటి ముందు టీ తాగుతుంది. అదే సమయంలో పక్కింట్లో ఉంటున్న ఉమారాణి, ఆమె కూతురు అమూల్య ఇద్దరు రాధికను దూషిస్తూ దాడి చేయగా గాయాలయ్యాయి. దీంతో ఆమె పోచారం ఐటీ కారిడార్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. గత నెల 23న కోర్టు అనుమతితో విచారణ చేపట్టిన పోలీసులు ఉమారాణి, అమూల్యలపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.